క్లుప్తంగా

ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీని కలిసిన ఎమ్మెల్యే ఠాకూర్



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ఠాగూర్

గోదావరిఖని: రాష్ట్ర ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియాను మంగళవారం రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ హైదరాబాద్‌లో కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నిధుల్లో తన నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలని కోరారు.

క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి



క్రీడాకారులతో ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి.రమేశ్‌గౌడ్ కోరారు. నిట్టూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న వారికి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, తోట శంకర్, తిరుపతిరావు, పిట్ట భాస్కర్, ఖాజా, షఫీయుద్దీన్, తాండ్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి లారీల అడ్డగింత



లారీలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

సుల్తానాబాద్‌రూరల్: ఓవర్‌లోడ్‌తో మట్టి తరలిస్తున్న లారీలను నారాయణపూర్ గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. అనుమతి పేరిట శనగకుంట నుంచి వందల లారీల్లో మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఓవర్‌లోడ్‌తో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని అన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై, ఆర్‌ఐలు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు మండల రమేశ్, మూల హరీశ్, సాగర్‌రావు, సతీశ్, కొండల్‌రావు, సదానందం పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహం ధ్వంసం

మంథని: పట్టణ ప్రధాన రహదారిపై ఉన్న వీరనారి ఐలమ్మ విగ్రహం పాక్షికంగా ధ్వంసమైంది. ఓ వాహనంతో ఐలమ్మ విగ్రహం చెయ్యి విరిగి కింద పడిపోయింది. సదరు వాహన యజమానితో విగ్రహం చెయ్యికి మరమ్మతు చేయించారు.



విరిగిన చెయ్యి

కొలనూర్‌లో ఈతవనం దగ్ధం

ఓదెల: కొలనూర్ మార్కెట్ ఏరియాలోని మెయిన్ రోడ్డులో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఈతవనం దగ్ధమైంది. మంగళవారం సాయంత్రం ఈదురుగాలులకు అకస్మాత్తుగా నిప్పంటుకోవడంతో పొలాల్లోని గడ్డి కాలిబూడిదైంది. రైతులు అప్రమత్తం అయి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

గ్రామాల్లో వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి, ఇందుర్తి, గుంపుల గ్రామాల్లో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. అనుమతి లేకుండా కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపు వెళ్లే పలు వాహనాలకు జరిమానా విధించారు.

కాలిబూడిదైన పశుగ్రాసం

కాల్వశ్రీరాంపూర్: మొట్లపల్లి, కిష్టంపేట గ్రామాల్లో మంగళవారం వ్యర్థాలకు నిప్పంటించడంతో పశుగ్రాసం, మొక్కజొన్న పంట దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. మొట్లపల్లిలో ముద్దసాని రాజేశంకు చెందిన పశుగ్రాసం, కిష్టంపేటలో మాదరి సతీశ్‌కు చెందిన మొక్కజొన్న పంట మంటల్లో కాలిపోయాయన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జరిమానా

రామగిరి: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన మహిళకు మంథని ఆబ్కారీ శాఖ అధికారులు జరిమానా విధించారు. సీఐ రాకేశ్‌కుమార్ కథనం ప్రకారం.. బేగంపేట గ్రామానికి చెందిన ఓ మహిళ నాటుసారా కేసుల్లో పట్టుబడగా అప్పట్లో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో మళ్లీ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. దీంతో ఆమెకు రూ.30వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హద్దుల సమస్యకు చెక్

- ప్రైవేట్ సర్వేయర్లకు శిక్షణ
- శిక్షణ తర్వాత క్షేత్రస్థాయిలోకి..



సుల్తానాబాద్: జిల్లాలోని పట్టదారు, ప్రభుత్వ, బంజరు భూముల హద్దులు ఇక పక్కాగా ఉండనున్నాయి. చెరువులు, కుంటలు, గ్రామాల నక్షా సమగ్రంగా ఉండనుంది. ఇందుకోసం ప్రైవేట్ సర్వేయర్లకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి భూభారతి చట్టం అమలు అమలు చేస్తున్న నేపథ్యంలో సర్వేర్ల కొరతను అధిగమిచేందుకు ప్రభుత్వం సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. మండలానికి 30మంది చొప్పున సర్వేయర్లను ఎంపిక చేయనుంది. ఎంపికైన వారికి ఈనెల 26 నుంచి జూలై 26వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనుంది.

హద్దుల్లో చిక్కులు..

గత ప్రభుత్వంలో భూముల విలువలు అమాంతం పెరిగాయి. ఇవి తరచూ గొడవలకు దారితీస్తున్నాయి. గొడవలు, ఘర్షణలు, కేసులను నియంత్రించేందుకు ప్రభుత్వం భూములు సర్వే చేయాలని భావిస్తోంది. ఇందుకోసం సర్వేయర్లు అవసరమని గుర్తించింది.

ధరణిలో తప్పుడు వివరాలు..

ధరణి పోర్టల్‌లో 60శాతానికి పైగా భూముల వివరాలు తప్పుగా నమోదైనట్లు యజమానుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. హద్దులు, విస్తీర్ణం, పేర్లు, ఇంటిపేర్లు తదితర సమాచారంలో లోపాలు తలెత్తాయి. ప్రధానంగా భూముల విస్తీర్ణం, హద్దుల విషయాన్ని తేల్చేందుకు రైతులు బారులు తీరారు. అయితే, భూముల సర్వేకు డివిజన్ స్థాయిలో కనీసం 60 నుంచి 90రోజుల వరకు రైతులు ఎదురు చూడాల్సి వచ్చేది. హద్దులు తేలక భూములు విక్రయించి కూతుళ్ల, కుమారుల వివాహం చేయాలని భావించే తల్లిదండ్రుల బాధలు వర్ణనాతీతంగా ఉండేవి.

శిక్షణ తర్వాత సర్వే..

శిక్షణ పొందిన సర్వేయర్లతో రైతులు తమ భూముల హద్దులు, విస్తీర్ణం సర్వే చేయించే వీలుందని అధికారులు చెబుతున్నారు. గ్రామ నక్ష, రెవెన్యూ రికార్డుల ప్రకారం భూముల సరిహద్దులు సక్రమంగా ఉన్నాయా, లేదా అని శిక్షణ పొందిన సర్వేయర్లు సర్వే చేసి ధ్రువీకరించనున్నారు. అంతేకాదు.. భూములు పంచుకున్న సమయంలో వాటిని విభజించి సరిహద్దులు ఏర్పాటు చేస్తారు. దానికి సంబంధించిన చిత్రటాన్ని కూడా వారు ఇవ్వనున్నారు. వివాదాస్పద భూములు ఉంటే ప్రభుత్వ సర్వేయర్లు వచ్చి పరిశీలిస్తారు.

సర్వేయర్ల శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం ఆసక్తి, అర్హత గలవారి నుంచి ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్‌కు మీసేవ కేంద్రాల్లో రూ.100 రుసుం చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందాలన్నారు. ఇంటర్ గణితంలో 60శాతం మార్కులు సాధించి, ఐటీఐ డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, డిప్లొమా సివిల్, బీటెక్ సివిల్ సమానమైన అర్హత గల వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి 50 పనిదినాలలో శిక్షణ ఇస్తారని వివరించారు. ఓసీ అభ్యర్థులు రూ.10వేలు, బీసీలు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.2,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 98490 81489, 70326 34404, 94419 47339 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాజాపూర్‌ను నిర్వాసిత గ్రామంగా ప్రకటించండి

రామగిరి: సింగరేణి ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2 బ్లాస్టింగ్‌లతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రాజాపూర్ గ్రామస్తులు ఆవేదన చెందారు. ఈమేరకు హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న, గ్రామ అధ్యక్షుడు పుల్లెల కొంరయ్య ఆధ్వర్యంలో మంత్రిని కలిసి సమస్యలు విన్నవించారు. తమ ఊరును నిర్వాసిత గ్రామంగా ప్రకటించాలని విన్నవించగా, మంత్రి తగిన హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు మాటేటి సాగర్, పుల్లెల శ్రీనివాస్, పుల్లెల సతీశ్, కలవేన శ్రీకాంత్, ఎండీ చోటేమియా, కన్నూరి పర్వతాలు, పాశం కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అనుకూలం

తమ గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదని రత్నాపూర్ గ్రామస్తులు వెల్లడించారు. ఈమేరకు మంత్రి శ్రీధర్‌బాబుకు రైతులు విన్నవించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. పార్క్‌లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు సానుకులంగా స్పందించారని గ్రామస్తులు తెలిపారు. రైతులు దాసరి రాంచందర్, తోట్ల రాయమల్లు, కండె పోశం, కొండ అంజన్న, కెక్కర్ల శ్రీనివాస్, దర్మల వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుతో రాజాపూర్ గ్రామస్తులు

సూపర్‌వైజర్లను విధుల్లోకి తీసుకోవాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

కోల్‌సిటీ(రామగుండం): విధుల నుంచి తొలగించిన పారిశుధ్య సూపర్‌వైజర్లు బైరి రాజబాబు, సంగ వెంకటస్వామిని వెంటనే విధుల్లోకి తీసు కోవాలని రామగుండం నగరపాలక సంస్థలోని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. చర్చల అనంతరం నగరపాలక కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీకి, పలు డిమాండ్ల పత్రాన్ని జేఏసీ నాయకులు అందజేశారు. జేఏసీ నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, వై.యాకయ్య, వెల్పుల కుమారస్వామి తదితరులు మాట్లాడారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామితో జేఏసీ నాయకులు సమస్యల పరిష్కారంపై చర్చలు జరిపారు.

సమ్మెను వ్యతిరేకించండి

యైటింక్లయిన్‌కాలనీ: కొన్ని సింగరేణి కార్మిక సంఘాలు ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను వ్యతిరేకించాలని బీఎంఎస్ అధ్య క్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. మంగళవారం ఆర్జీ–2లోని బీఎంఎస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి సారంగపాణితో కలిసి మాట్లాడారు. భారతదేశం– పాకిస్తాన్ మధ్య నెలకొన్ని ఉద్రిక్తతల నేపథ్యంలో సమ్మె చేయడం సరికాదన్నారు. దేశసమగ్రతకు విఘాతంగా కలిగించేలా సమ్మె చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు కుమారస్వామి, వేణుగోపాల్ రావు, సతీశ్, శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, నరేశ్, శివాజీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి

సుల్తానాబాద్: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ సుగ్లాంపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్, కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కొనుగోలు కేంద్రాలతోపాటు లారీల ద్వారా ధాన్యం రైస్‌మిల్లుకు చేరవేయడం ద్వారా కొనుగోళ్లు పూర్తయ్యాయని వివరించారు.

సొంతింటి కల నేరవేర్చుతాం

రామగిరి: సింగరేణి కార్మికుల సొంతింటి కల నేరవేర్చుతామని, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 17 వేల కట్టడాలకు పట్టాలిచ్చామని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ ఉపాధ్యక్షుడు ధర్మపురి అన్నారు. మంగళవారం సెంటినరీకాలనీలోని శ్రీపాదభవన్‌లో ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 8న హైదరాబాద్‌లో కోర్ కమిటీ సమావేశం నిర్వహించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తీర్మానించామన్నారు. కుమార్‌స్వామి, తిరుపతి, రామరావు, సదానందం పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈవో, అర్చకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ధ్వజస్తంభం, శిఖర, రాజగోపుర పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను జూన్ 4నుంచి 6వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ముద్దసాని శంకరయ్య తెలిపారు. ఆలయ ఆవరణలో మంగళవారం అర్చకులు లక్ష్మీనర్సింహాచార్యులు, శ్రీకాంతచార్యులు, ధర్మకర్తలు సదయ్య, సుమన్, ఆడెపు సౌందర్య, శ్రీనివాస్, సతీశ్, రాజమౌళి, సురేశ్ కరపత్రాలు ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సుల్తానాబాద్‌లో ఆటో స్వాధీనం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రవీందర్ ఆటోట్రాలీని ఈనెల 11న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా మంగళవారం స్థానిక చెరువు కట్ట వద్ద పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్న గజ్వేల్ సంగుపల్లికి చెందిన తూర్పాటి వంశీ, స్నేహితుడు అనిల్ కలిసి ఆటో ట్రాలీని దొంగతనం చేసి అమ్మేందుకు వెళ్తుండగా చెరువుకట్ట సమీపంలో పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. ఆటోను స్వాధీనం చేసుకొని వంశీని రిమాండ్ తరలించగా అనిల్ పరారీలో ఉన్నట్లు ఆయన వివరించారు.

సమ్మెతోనే కార్మికుల హక్కులు సాధ్యం



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: సమ్మెతోనే కార్మికుల హక్కులు సాధ్యమని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం జీడీకే–1వ గనిలో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈనెల 20న జరిగే సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్మిక చట్టాల మార్పులతో సింగరేణికి నూతన గనులు రావడం లేదని, పని గంటలు పెంచే అవకాశం ఉందని, సమ్మెచేసే హక్కు ఉండదన్నారు. కొత్త గనులు వస్తనే సంస్థ మనుగడ కొనసాగుతుందని, ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమ్మెలో పాల్గొనద్దని బీఎంఎస్ ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. సమావేశంలో నాయకులు గుండేటి శ్రీనివాస్, మెండె శ్రీనివాస్, కె.విశ్వనాథ్, రంగు శ్రీను, కవ్వంపల్లి స్వామి, సంకె అశోక్ పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలి

- జేఏసీ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

గోదావరిఖని: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–2ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన కోసం మే–20న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్మిక చట్టాల జోలికి వస్తే ఐక్య పోరాటాలతో తిప్పికొడతామన్నారు. కార్మిక హక్కులను రక్షించుకోవడానికి ఐక్యపోరాటాలే శరణ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈదునూరి రామకృష్ణ, జక్కుల నారాయణ, ఐ.కృష్ణ, ఫయాజ్‌బేగ్, ఎస్.రవీందర్, నరేష్, ఐ.రాజేశం, ఎస్.ప్రసాద్, ఎం.కొమురయ్య, ఎడ్ల రవికుమార్, సంపత్, సత్యం, ఆర్.సంజీవ్, గుజ్జుల స్వా మి, శంకరయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజులను నియంత్రించాలి

పెద్దపల్లిరూరల్: ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థల్లో ఫీజులు నియంత్రించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడిగా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన రత్ననరేశ్, కార్యదర్శిగా శివకేశవను ఎన్నుకున్నారు. నాయకులు సుమంత్, స్వాతి, తేజ, రాకేశ్, మమత, అజయ్, లక్ష్మణ్, శ్యాం, భవాని, రేష్మ తదితరులు పాల్గొన్నారు.



రత్న నరేశ్

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

జూలపల్లి: మండలంలోని రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రత్యూష తెలిపారు. 30 కిలోల బస్తాకు సబ్సిడీ పోగా రూ.2137.50 చెల్లించాలని వివరించారు. బస్తా విత్తనాలు రెండకరాలకు సరిపోతుందని వివరించారు.

వైభవంగా మహా పూర్ణాహుతి

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రాయంగల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న తిరుక్కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం మహా పూర్ణాహుతి నిర్వహించారు. బుధవారం రథోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు తరలిరావాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో భాగవత చరణు రేణువు రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల తొలగింపు



ప్లాస్టిక్ కవర్లను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

ధర్మారం: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డులో ఇళ్ల సమీపంలోని ఉన్న ప్లాస్టిక్ కవర్లు, చెత్తను మంగళవారం గ్రామపంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. 'ఇళ్ల చుట్టూ ప్లాస్టిక్ కవర్లు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఇళ్ల చుట్టూ ఉన్న ప్లాస్టిక్ కవర్లు, చెత్తను వెంటనే తొలగించాలని స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

క్రీడలకు ఎన్టీపీసీ పెద్దపీట



బ్యాటింగ్ చేస్తున్న ఈడీ చందన్‌కుమార్ సామంత

జ్యోతినగర్: రామగుండంలోని ఎన్టీపీసీ క్రీడలకు పెద్దపీట వేస్తుందని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత అన్నారు. మంగళవారం రాత్రి పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో లెజెండ్స్ క్రికెట్ టోర్నమెంట్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు విధి నిర్వహణతోపాటు వ్యాయామం, క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని సూచించారు. ఐదు జట్లు ఈనెల 19వ తేదీ వరకు లీగ్ మ్యాచ్‌లు ఆడనున్నట్లు ఆయన తెలిపారు. జనరల్ మేనేజర్, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు అలోక్ కుమార్ త్రిపాఠి, ముకుల్ రాయ్, ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్, జనరల్ సెక్రటరీ గనేశ్వర్ జడ్డీ, ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల జయంతి కన్వీనర్‌గా శ్రీనివాస్‌గౌడ్

సుల్తానాబాద్: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ మండల అధ్యక్షుడిగా గట్టెపల్లి గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. మంగళవార స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో నియామక పత్రం అందజేశారు. ఉపాధ్యక్షులుగా రమేశ్, నరేశ్, ప్రధానకార్యదర్శిగా కొల్లూరి సంతోష్, సంయుక్త కార్యదర్శిగా సత్తనపల్లి రాజు, కోశాధికారిగా శ్రీనివాస్, ముఖ్యసలహాదారుగా సురేశ్, సభ్యులుగా సతీశ్, రాజశేఖర్‌ను నియమించారు.

కమనీయం.. కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: పందిల్ల శివాలయంలో ఆలయ 2వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహిళలు స్వామివారలకు సారెచీర సమర్పించి ఒడిబియ్యం పోశారు. మాజీ సర్పంచ్ అటికం శంకర్‌గౌడ్, దాసరి లావణ్య, మాజీ ఎంపీటీసీ రావి సదానందం, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నృసింహుని రథోత్సవం



పూజలు చేస్తున్న లక్ష్మణ్, విజయరమణారావు

ధర్మారం: ఖిలావనపర్తి శ్రీలక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ఉత్సవాలు చేపట్టారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పోలదాసరి సంతోష్, ఈవో కాంతారెడ్డి, ఏర్పాట్లు పర్యవేక్షించారు.

19న పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కమాన్‌పూర్: పిల్లిపల్లెలోని పెద్దమ్మ ఆలయంలో ఈనెల 18 నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ముదిరాజ్ కులస్తులు మంగళవారం తెలిపారు. 19న విగ్రహ ప్రతిష్ఠాపనతోపాటు పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బోనాలు, కొలుపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వారు వివరించారు.

సింగరేణి వార్తలు

రెస్క్యూ సిబ్బంది సేవలు భేష్



సిబ్బందితో ప్రాజెక్టు, ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

గోదావరిఖని: శ్రీశైలం ఎస్ఎల్‌బీసీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మెయిన్ రెస్క్యూ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో కీలకంగా వ్యవహరించిన రెస్క్యూ సిబ్బందిని కలిసి ప్రశంసించారు. ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ మాధవరావు తదితరులు ఉన్నారు.

18న సింగరేణి మెగాజాబ్ మేళా



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఈనెల 18న మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీ హార్డ్‌వేర్, రిటైల్, హాస్పిటల్ డ్యూటీ, సెక్యూరిటీ జాబ్స్ తదితర రంగాలకు చెందిన సంస్థలను పాల్గొంటాయన్నారు. కనీస విద్యార్హతలు ఏడు నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు ఉండాలని, 18 నుంచి 30ఏళ్ల లోపు వయసు వారు అర్హులన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పర్సనల్ డీజీఎం కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మెగా జాబ్‌మేళా నిర్వహించే సింగరేణి కమ్యూనిటీ హాల్‌ను జీఎం పరిశీలించారు. రెండు జిల్లాల నుంచి సుమారు 10వేలమంది నిరుద్యోగులు హాజరైయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

పనిచేయని కూలర్లు

గోదావరిఖని: ఓసీపీ–3లోని రెస్టుహాల్‌లో కూలర్లు పనిచేయడంలేదని, భారీ యంత్రాల్లో ఏసీలు పాడైపోయాయని కార్మికులు ఎలా పనిచేస్తారని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు బదావత్ శంకర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఓసీపీ–3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్పత్తిపై దృష్టి పెట్టిన సింగరేణి.. కార్మికుల రక్షణ, సంక్షేమాన్ని గాలికొదిలేందని ధ్వజమెత్తారు. అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే ఉత్పత్తి స్తంభింపజేస్తామని హెచ్చరించారు. నాయకులు కొంగర రవీందర్, ఎండీ అక్రమ్, కొత్త సత్యనారాయణరెడ్డి, దశరథంగౌడ్, సంపత్‌రెడ్డి, సాలిగామ మల్లేశ్, మేకల శ్రీనివాస్, కర్క శ్రీనివాస్, కోల కనకయ్య పాల్గొన్నారు.

ఏసీలు ఏర్పాటు చేయాలి

గోదావరిఖని: రెస్ట్‌షెల్టర్లలో ఏసీలు ఏర్పాటు చేయాలని జీడీకే–5 ఓసీపీ ఈపీ ఆపరేటర్లు కోరారు. మంగళవారం ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. మండుతున్న ఎండల దృష్ట్యా రెస్ట్ షెల్టర్‌లలో ఫ్యాన్ గాలి వేడిగా ఉండి వడదెబ్బకు గురవుతున్నామన్నారు. తమసొంత ఖర్చులతో ఏసీని ఏర్పాటు చేసుకుంటామని, దీనికి సంబంధించి అనుమతి ఇవ్వాలని అన్నారు. ఏఐటీయూసీ ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్, నాయకులు గండి ప్రసాద్, రాయుడు శ్రీనివాస్, చింతపండు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఏజీఎంకు సన్మానం

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్ ఏజీఎం ఎర్రన్న భూపాలపల్లి ఏరియా ఇంజినీర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎర్రన్నను జీఎం వెంకటయ్య శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఎస్ఓటూ జీఎం రాముడు, ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్, ఏరియా రక్షణఅధికారి సంతోష్‌కుమార్, డీజీఎం ధనుంజయ్, అనిల్‌కుమార్, మురళీకృష్ణ, మాధవరావు పాల్గొన్నారు.

ఫీల్డ్ చైర్మన్‌గా జీవరత్నం



కొత్త కార్యవర్గం

కమాన్‌పూర్: ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా గోదావరిఖని ఫీల్డ్ చైర్మన్‌గా వాసాల జీవరత్నం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ఐఎంఐ సెక్రటరీ అంకరి కుమార్ తెలిపారు. స్థానిక కల్వరి చర్చిలో మంగళవారం ఫీల్డ్ సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. స్వామిదాస్, శ్రీనివాస్, ఐజాక్, విక్టర్, దయాకర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెద్దపల్లి జిల్లా: 9951602934

Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : ప్రశాంత్ - 9652397696
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899